క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం




చలివేంద్రంలో నీటిని పంపిణీ చేస్తున్న దిశ డీఎస్పీ రమాకాంత్

కడప అర్బన్: కడప 'దిశ' పోలీస్‌స్టేషన్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దిశ డీఎస్పీ ఎస్.రమాకాంత్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 18న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు ఆయా పోలీస్‌స్టేషన్ల ఆవరణాల్లో ప్రజల దాహార్తిని తీర్చేలా 'చలివేంద్రాలు' ప్రారంభించారు. ఈ క్రమంలో శుక్రవారం కడప దిశ పోలీస్‌స్టేషన్ ఆవరణలో చలివేంద్రంను ఏర్పాటు చేసి ప్రారంభించారు. సీఐ వినయ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐలు మురళీ, ద్వారకా, లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బంగ్లేషావలి ఉరుసు

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని పెన్నానది ఒడ్డున గల హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అబ్దుల్ ఖాదర్ హుస్సేనీ చిష్టిపుల్ ఖాద్రీ, అలియాస్ బంగ్లేషావలి ఉరుసు ఉత్సవం శనివారం నిర్వహించనున్నట్లు స్థానిక అమీన్‌పీర్ దర్గా ప్రతినిధి అమీర్ తెలిపారు. ఇందులో భాగంగా పెద్దదర్గా సజ్జాదా నషీన్ హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా హుస్సేనీ సాహెబ్ తమ ఇంటి వద్ద నుంచి గంధం కలశాన్ని ఫకీర్ల మేళతాళాల మధ్య వాటర్‌గండి సమీపంలోని బంగ్లేషావలి దర్గా వద్దకు చేర్చనున్నట్లు వివరించారు. అనంతరం పెద్దదర్గా పీఠాధిపతి గురువుల మజార్‌కు గంధాన్ని సమర్పిస్తారన్నారు. అనంతరం భక్తులందరికీ అన్నదానం చేస్తామని ఈ సందర్భంగా ప్రముఖ కళాకారులతో ఖవ్వాలి కార్యక్రమం కూడా నిర్వహిస్తామన్నారు.

నేడు చాంద్‌ఫిరా గుంబజ్ దర్గా నషాన్



చాంద్‌ఫిరా గుంబజ్ దర్గా

కడప కల్చరల్: కడప నగరం రహమతుల్లా వీధిలోని చాంద్‌ఫిరా గుంబజ్ దర్గా నషాన్ ఉత్సవం శనివారం రాత్రి నిర్వహించనున్నట్లు దర్గా ముతవల్లి అమీరున్నీసా తెలిపారు. ఈ సందర్భంగా దర్గా ఆవరణలో జెండాను నషాన్‌గా ఊరేగింపుగా తెచ్చి ప్రతిష్టించనున్నట్లు తెలిపారు. అనంతరం ఫాతేహా చేసి భక్తులకు పంచిపెట్టనున్నట్లు తెలిపారు.

నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో ఉపాధి అవకాశాలు

కడప కోటిరెడ్డిసర్కిల్: నగరంలోని జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో నిరుద్యోగ యువతీ యువకులకు పలు కోర్సులలో శిక్షణతో పాటు ఉపాధి పొందే అవకాశాన్ని కల్పిస్తున్నామని రీజనల్ కో–ఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా సమయంలో ఉచిత భోజనం,వసతి కల్పిస్తామన్నారు.ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 9966448807, 7013665112 సంప్రదించాలని సూచించారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : మండలంలోని పెద్దచెప్పలి సచివాలయ పరిధిలోని పెద్దచెప్పలి, పి.కొత్తపల్లె, ఈడిగపల్లె గ్రామాల్లో మూడవరోజు శనివారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ శేషా చలపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన అందులో తెలిపారు.

నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలు

వైవీయూ: కడప నగరం బాలాజీనగర్‌లోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఇండియా సిమెంట్స్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. వీరసుదర్శన్‌రెడ్డి తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా లేదా గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకు ఏరియా రిలేషన్‌సిప్ ఎగ్జిక్యూటివ్ (సేల్స్) ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు రెజ్యూమ్‌తో కళాశాలలో హాజరుకావాలని సూచించారు.

ఎస్‌జీఎఫ్ అండర్-19 నేషనల్స్‌కు ఎంపిక

కడప స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జూన్ 6 నుంచి 12వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి హాకీ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు కడప నగరానికి చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. నగరంలోని సెయింట్ జోసఫ్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న కార్తీక్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న ప్రియ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు డీఎస్ఏ శిక్షకుడు పి. కల్యాణ్, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్ తెలిపారు.

1 నుంచి వాహనాల స్పెషల్ డ్రైవ్



మాట్లాడుతున్న కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్



పాల్గొన్న ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు

- డ్రైవర్లు యూనిఫాం ధరించడంతో పాటు, నిబంధనలు పాటించాలి
- కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్

కడప అర్బన్: కడప నగరంలో జూన్ 1వ తేదీ నుంచి వాహనాలతో పాటు, ఆటోలకు సంబంధించిన స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించనున్నామని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం కడపలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. ఆటో డ్రైవర్లు యూనిఫాం తప్పనిసరిగా ధరించాలన్నారు. స్కూల్ పిల్లల్ని తీసుకుని వెళ్లేవారు అధికలోడ్‌ను నియంత్రించాలన్నారు. ప్రతి ఆటోపై పీసీ నెంబర్ తప్పనిసరిగా ఉండేగా చూసుకోవాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, ఇతర రద్దీ ప్రాంతాల్లో ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక నుంచి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు ముమ్మరంగా నిర్వహిస్తామన్నారు. మద్యం సేవించి ఆటోలను నడిపితే జైలు శిక్షపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలనీ డీఎస్పీ కోరారు. ఈ సమావేశంలో కడప ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది, ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వీధి బాలల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్



కడప రైల్వేస్టేషన్‌లో వీధిబాలల కోసం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలోని వీధి బాలలను గుర్తించేందుకు శుక్రవారం అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రైల్వేస్టేషన్, ఆర్టీసీ కొత్త, పాత బస్టాండు సముదాయాలలో ఈ డ్రైవ్ నిర్వహించారు. ప్రధానంగా ఈ ప్రాంతాలలోనే వీధి బాలల సంచారం ఎక్కువగా ఉంటుంది.అందుకే వీటిపై దృష్టి కేంద్రీకరించారు. జిల్లాలోని అన్ని ముఖ్య కేంద్రాలలో ఈనెల 23 వతేది వరకు వీధి బాలల గుర్తింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఐసీడీఎస్ పీడి ఎం.ఎస్ రాణి ఆదేశాల మేరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో జిల్లా బాలల పరిరక్షణ విభాగం సామాజిక కార్యకర్త బి.వినోద్ కుమార్, కడప అర్బన్ ఐసీడీపీఓ శోభారాణి, సూపర్‌వైజరు దీప. మాబూచాన్, రైల్వే పోలీసులు, వార్డు మహిళా పోలీసులు పాల్గొన్నారు.

అధిక చార్జీల వసూళ్లను అదుపు చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్: ప్రైవేట్ బస్సుల్లో వసూలు చేస్తున్న అధిక చార్జీలను అదుపు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రైవేట్, అన్ కాంట్రాక్ట్ బస్సుల్లో వసూలు చేస్తున్న అధిక చార్జీలను అదుపు చేయాలని కోరుతూ జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఈ. మీరా ప్రసాద్‌కు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నుంచి విజయవాడ, హైదరాబాదుకు రూ. 1900 ప్రయాణికుల నుంచి అత్యధికంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. వరుసగా మూడు రోజులు సెలవు దినాలు వస్తే ప్రైవేట్ బస్సులకు పండగగా మారిందన్నారు. అధిక వేగంగా విజయవాడ, హైదరాబాదుకు వెళుతున్న బస్సుల వేగాన్ని నియంత్రించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు చెప్పలి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలలో అధిక పోషకాలు

శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంతి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంతి

వైవీయూ : చిరుధాన్యాలలలో అధిక పోషకవిలువలు ఉండి శరీరానికి మేలు చేస్తాయని చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరులోని కృషివిజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. శుక్రవారం ఊటుకూరులోని కృషి విజ్ఞానకేంద్రంలో చిరుధాన్యాలపై రైతులకు, యువతకు 'వ్యవసాయంలో గ్రామీణ యువతను ఆకర్షించడం, నిలుపుకోవడం' అన్న అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రపంచదేశాలు సైతం అంగీకరించిన మిల్లెట్స్ ఇయర్ చిరుధాన్యాల ప్రాధాన్యతను చాటిచెబుతోందన్నారు. చిరుధాన్యాలను వినియోగించుకుని వ్యాపారరంగంలో ఏ విధంగా అభివృద్ధి సాధించవచ్చో వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.ఎ. వీరయ్య, రైతులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కడప వైఎస్సార్ సర్కిల్: పుచ్చలపల్లి సుందరయ్యను నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్థంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు వరాలు కురిపిస్తూ సామాన్య ప్రజలపై భారాలను మోపుతోందన్నారు. 2024లో బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించడమే దేశ భక్తి అని ప్రజలకు పిలుపు నిచ్చారు. సీపీఎం నాయకులు ఐఎస్ సుబ్బమ్మ, జమీల, చంద్రా రెడ్డి, ఓబులేసు, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

కూల్‌డ్రింకుల్లో రుచి వెనుక రోగాలు



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న శిక్షకులు రవికుమార్

కడప కల్చరల్: కూల్ డ్రింక్స్ తాగడం వల్ల రోగాలు వచ్చే ప్రమాదం ఉందని సైన్స్ శిక్షకులు రవికుమార్ పేర్కొన్నారు. కడప నగరం కొండాయపల్లెలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరం విజయవంతంగా కొనసాగుతోంది. శుక్రవారం ఈ శిబిరంలో రవికుమార్ సాఫ్ట్ డ్రింకులవల్ల పొంచి ఉన్న ప్రమాదం గురించి చిన్నారులకు అవగాహన కల్పించారు. వేసవిలో రుచి, చల్లదనం కోసం ఈ కంపెనీ కూల్ డ్రింకులను పిల్లలు ఎక్కువగా ఇష్టపడతారని.. వాటి కంటే కొబ్బరి నీరు, నిమ్మరసం, చౌకలా లభించే మజ్జిగ తాగడం అన్ని రకాలుగా మంచిదన్నారు. ఈ సందర్భంగా మరికొందరు శిక్షకులు చిత్రలేఖనం, కథా పఠనం, నృత్యం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. హాజరైన చిన్నారులకు నిర్వాహకులు మజ్జిగను అందజేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ కడప పార్లమెంటు కన్వీనర్‌గా బాలకృష్ణ యాదవ్



కడప కోటిరెడ్డిసర్కిల్: భారతీయ జనతా పార్టీ కడప పార్లమెంటు కన్వీనర్‌గా బాలకృష్ణ యాదవ్‌ను నియమించారు. శుక్రవారం గన్నవరంలో బీజేపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోము వీర్రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బాలకృష్ణ యాదవ్‌ను అపాయింట్ మెంట్ చేశారు. ఈయన ప్రస్తుతం ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ యాదవ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. అలాగే బీజేపీ కడప జిల్లా ఇంచార్జ్‌గా దుద్దికుంట వెంకటేశ్వర రెడ్డిని నియమించారు.

పిల్లల్లో నైపుణ్యాలను పెంచాలి

వల్లూరు : పిల్లల్లో దాగి వున్న నైపుణ్యాలను గుర్తించి మరింతగా పెంచడానికి గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులు ఉపయోగపడతాయని వల్లూరు శాఖా గ్రంథాలయ అధికారిణి వెంకటేశ్వరమ్మ తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం పలువురు పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పిల్లలకు క్యారమ్స్, లూడో, చెస్ మొదలైన ఆటలను నేర్పించి వారి చేత ఆడించారు.

కమలాపురం : విజ్ఞానం, ఆలోచనలు పెంపొందించే క్రీడలు ఆడాలని కమలాపురం శాఖ గ్రంథాలయాధికారి నాగాంజలి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి జరుగుతున్న వేసవి విజ్ఞాన సదస్సులో భాగంగా శుక్రవారం విజ్ఞానం, ఆలోచనలు పెంపొందించే చెస్, క్యారమ్స్ తదితర ఆటల్లో ఆమె విద్యార్థులకు శిక్షణ నిచ్చారు. క్రీడల్లో రాణిస్తే విద్యలో రాణించడం చాలా సులభం అని ఆమె విద్యార్థులకు సూచించారు.

ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలి

వల్లూరు : ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడేను పాటించడం వలన లార్వాలను ప్రాథమిక దశలోనే నివారించి వివిధ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఖాదర్‌వలి తెలిపారు. మండలంలోని తోల్లగంగనపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని థెరిసానగర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న ఇంటింటి లార్వాల సర్వేను ఆయన పరిశీలించి వైద్య సిబ్బందికి, పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్థానికులతో సమస్యలను గురించి ఆరా తీశారు. ఏఎన్ఎమ్‌లు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు యాప్‌లలో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకట రెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు ఫణీంద్ర, ఎమ్‌పీహెచ్ఈవో ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

కమలాపురం : మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న చిరుద్యోగి శీలం శ్రీనివాసులు స్థాపించిన 'మన ఊరు సేవా సమితి' చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయం అని కమలాపురం మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం కడప–తాడిపత్రి ప్రధాన రహదారి క్రాస్‌రోడ్డు సమీపంలోని చలివేంద్రంలో ఏర్పాటు చేసిన మజ్జిగను ఆయన ప్రజలకు పంపిణీ చేశారు. గత 11 ఏళ్లుగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి వారంలో కనీసం రెండు రోజులైనా మజ్జిగ పంపిణీ చేయడం హర్షణీయం అన్నారు. శ్రీనివాసులును ఆదర్శంగా తీసుకుని మరిన్ని మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

27 నుంచి ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సమ్మేళనం

కడప వైఎస్సార్ సర్కిల్: ఈనెల 27, 28 తేదీల్లో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికవర్గం శతాబ్దకాలంగా అనేక పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చే ప్రయత్నం బీజేపీ ప్రభుత్వం చేస్తోందన్నారు. కార్మికులు ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేసి 12 గంటల పని విధానాన్ని అమలు పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం కడపలో జరిగే ఏఐటియూసీ రాష్ట్ర సమితి సమ్మేళనాలను కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు మద్దిలేటి, మస్తాన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు 'సాధన' నవల పరిచయ సభ

కడప కల్చరల్ : అనంతపురానికి చెందిన ప్రముఖ కథా నవలా రచయిత డాక్టర్ శాంతినారాయణ రచించిన 'సాధన' పుస్తక పరిచయ సభను ఆదివారం ఉదయం 10 గంటలకు కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రంలో నిర్వహించనున్నామని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు తెలిపారు. ఈ సభకు ప్రముఖ కథకులు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని, బ్రౌన్ గ్రంథాలయం బాధ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అధ్యక్షత వహిస్తారని తెలిపారు. అతిథులుగా రాష్ట్ర అధికార భాషాసంఘం సభ్యులు తవ్వా వెంకటయ్య, వేంపల్లి షరీఫ్ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 'సాధన' నవలను కర్నూలుకు చెందిన ప్రముఖ సాహితీవిమర్శకులు కె. నాగేశ్వరాచారీ పరిచయం చేస్తారన్నారు.

ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి

కడప వైఎస్సార్ సర్కిల్: జిల్లాలో ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు ఎంట్రెన్స్ టెస్ట్ పెడుతూ అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శివ, అరుణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్: రాష్ట్రంలో ఎండలు మండుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతల వల్ల అగ్ని గుండంగా మారిందని ప్రజలకు వేసవి నుంచి ఉపశమనం కలిగించేందుకు చలి వేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. వడ దెబ్బతో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలి

కమలాపురం : ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు ప్రతి వైద్య ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని డీఎంఅండ్‌హెచ్ఓ ఖాదర్‌వల్లి తెలిపారు. శుక్రవారం పెద్ద చెప్పలి పీహెచ్‌సీ పరిధిలోని జి.అప్పాయపల్లెలో జరుగుతున్న ఫ్యామిలి ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. వైద్య సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అలాగే వారికి అందిస్తున్న సేవలను యాప్‌లో నమోదు చేసే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నినాదంతో ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిందన్నారు. సూపర్‌వైజర్లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలన్నారు. 35 ఏళ్ల పైబడిన ప్రజలందరికి బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి రోగాలున్న వారిని గుర్తించాలన్నారు.

వెబ్‌సైట్‌లో బొటానికల్ గార్డెన్ సమాచారం

- న్యూట్యాబ్‌ను ప్రారంభించిన వీసీ



వైవీయూ వెబ్‌సైట్ న్యూట్యాబ్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ సుధాకర్, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ తదితరులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో 20 ఎకరాల్లో విస్తరించి ఉన్న బొటానికల్‌గార్డెన్‌కు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని వైవీయూ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం వైవీయూలో వెబ్‌సైట్‌కు సంబంధించిన న్యూట్యాబ్‌ను వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వెబ్‌సైట్‌లో 2008 నుంచి 2023 వరకు గార్డెన్‌కు సంబంధించిన సమగ్ర సమాచారం లభిస్తుందన్నారు. గార్డెన్‌లోని మొక్కలు, అతిథులు, పరిశోధకుల, విద్యార్థుల సందర్శన సమాచారం ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ఐటీ హబ్ డైరెక్టర్ ఆచార్య ఎం.వి. శంకర్, అకడమిక్ డీన్ ఆచార్య ఏజీ దాము, ఆర్ అండ్ డీ సంచాలకులు ఆచార్య పి. చంద్ర ఓబులరెడ్డి, గార్డెన్ సమన్వయకర్త ఆచార్య ఎ. మధుసూదన్‌రెడ్డి, ఐటీ హబ్ సాంకేతిక బృందం ఎస్. అబ్దుల్ రకీబ్ పాల్గొన్నారు.

ఆచరణాత్మక అభివృద్ధి దర్శిణి వేమనవాణి

యోగివేమన విశ్వవిద్యాలయం ఆలోచనలు, ఆచరణ, అభివృద్ధికి దర్శిణిగా 'వేమనవాణి' నిలవాలని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం వైవీయూలో 'వేమన వాణి' న్యూస్ లెటర్ త్రైమాసిక పత్రికను చీఫ్ ఎడిటర్, రిజిస్ట్రార్ వై.పి.వెంకటసుబ్బయ్య, ఎడిటర్ ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి, సహ సంపాదకులు టి. సురేష్‌బాబుతో కలిసి ఆవిష్కరించారు.

ఐటా జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు



ఐటా జిల్లా నూతన కార్యవర్గం

వైవీయూ: ఆలిండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా) జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటైంది. కడప నగరం బెల్లంమండివీధిలోని మద్రస జహారాలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐటా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. అబ్దుల్‌రజాక్, జాతీయ కార్యదర్శి ఎస్. షాకీర్‌హుస్సేన్ సమక్షంలో నూతన కార్యవర్గం ఏర్పాటైంది. జిల్లా అధ్యక్షుడిగా ఎస్. నజీర్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా ఎస్.అబ్బాస్‌అలీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడుగా గౌస్‌మోహిద్దీన్, ఉపాధ్యక్షులుగా ఎస్.ఎం.ఖాదర్, అహ్మద్‌అలీ, జాయింట్ సెక్రటరీలుగా ఫక్రుద్దీన్, జుబేర్, కోశాధికారిగా అబ్దుల్‌కలాంలను ఎన్నుకున్నారు.

విద్యుత్ సమస్యలా... ఈ నంబర్లలో సంప్రదించండి

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడైనా విద్యుత్ సంబంధిత సమస్యలు ఏర్పడితే ఈ కింది నంబర్లకు ఫోన్ చేయాలని విద్యుత్ శాఖ కడప ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎస్ రమణ తెలిపారు. మొదట సంబంధిత సబ్‌స్టేషన్‌కు, ఆ తర్వాత ఏఈకి ఫోన్ చేయాలన్నారు.

సబ్‌స్టేషన్ల నంబర్లు

ఎల్ఐసీ ఆఫీసు	94906 15131	పవర్ హౌస్	94906 15137
రిమ్స్	94906 15132	మూలవంక	94906 15138
సాయిపేట	94906 15133	చినకాంపల్లె	94906 15139
రామరాజుపల్లె	94906 15134	చెన్నూరు	94906 15140
కలెక్టర్ ఆఫీసు	94906 15135	కనపర్తి	94906 15141
చిన్నచౌకు	94906 15136	ఐడీఏ	94906 15142

ఏఈల నంబర్లు

- ఏఈ(ఈస్ట్)	94408 11920	-ఏఈ(సాయిపేట)-	94906 15780
- ఏఈ(వెస్ట్)	94408 11923	-ఏఈ(ఎన్‌జీవోకాలనీ)	94910 52940
- ఏఈ(నార్త్)	94408 11921	-ఏఈ(బాలాజీ నగర్)	94910 52976
-ఏఈ(సౌత్)	94408 11922		
-ఏఈ(కడపరూరల్స్)	94408 11928		

డీఈల నంబర్లు

డీఈఈ(టౌన్-1)-	94408 11919
డీఈఈ(టౌన్-2)	94910 52975
డీఈఈ(రూరల్స్-1)	94408 11924
డీఈఈ(రూరల్-2)	94906 18812
ఈఈ(ఆపరేషన్,కడప)	94408 11918
ఎస్ఈ(ఆపరేషన్,కడప)	94408 11751